క్లుప్తంగా

వైన్ షాపుల మూసివేత

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం సాయంత్రం వైన్ షాపులను మూసి వేయించారు. ఈనెల 30న ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని వైన్ షాపులు, బార్, కల్లు దుకాణాలను మూసి వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ తెలిపారు. ఈనెల 30వ తేది సాయంత్రం 5 గంటల వరకు వైన్ షాపులు మూసి ఉంటాయని అన్నారు.

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి జీవదాన్ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 270 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎన్నికల సామగ్రితో పాటు ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ చేయనున్నట్లు చెప్పారు.

ఆర్థిక సహాయం



కామారెడ్డి రూరల్: గూడెం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామాయంపేట లింగంకు బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు గుడుగుల బాలరాజు, సర్పంచ్ దంతెపల్లి స్వామి, ఉప సర్పంచ్ మోతే మహేందర్ గౌడ్, మండల పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రిషిత్ ప్రతిభ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం దేవునిపల్లి మధురానగర్‌కు చెందిన కాసం సాయి రిషిత్ ప్రతిభ కనబర్చి కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఓకినావా మార్షల్ అకాడమీ ఈనెల 26న నిజామాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో సాయి రిషిత్ బ్యాక్‌బెల్ట్ సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. రిషిత్ నిజామాబాద్‌లోని తెలంగాణ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో అడ్ల వెంకటేష్ పటేల్ ద్వారా శిక్షణ తీసుకున్నారు. నిజామాబాద్ కేంద్రీయ విద్యాలయంలో ఆరవ తరగతి చదువుతున్నారు.

బద్దిపోచమ్మ బోనాల ఉత్సవం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మదనగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బద్దిపోచమ్మ బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. నాయక్‌పోడ్ కుటుంబాలు ఇంటికొక బోనాలతో అమ్మవారి ఆలయం వరకు భాజాభజంత్రీలతో ర్యాలీగా తరలివచ్చారు. అమ్మవారికి బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ ఒక్క రోజే కీలకం

మద్నూర్(జుక్కల్): ఎన్నికల ప్రచారం ముగియడంతో మిగిలిన ఒక్క రోజే చాలా కీలకమని నాయకులు చెబుతున్నారు. ఇన్ని రోజులు ప్రచారం చేసి తిరిగింది ఒక ఎత్తయితే ఎన్నికలకు ఒక రోజు ముందు ఉన్న సమయం ఎంతో ముఖ్యమైనదని కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఈ ఒక్క రోజు రాజకీయం మొత్తం కింద మీద కావచ్చని సీనియర్ లీడర్లు అంటున్నారు. సహజంగానే ఎన్నికలప్పుడు తప్ప నాయకులు ఎప్పుడూ గ్రామాలకు వెళ్లలేదనే అపవాదును మూటగట్టుకుంటారు. బీఆర్ఎస్ అభ్యర్థులను కేసీఆర్ ముందే ప్రకటించడంతో వారు ప్రశాంతంగా అన్ని గ్రామాలను చుట్టివేశారు. గ్రామాల్లోని కార్యకర్తలు, నాయకులకు ఫోన్ల ద్వారా తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రచారానికి సమయం ముగియడంతో కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ఎక్కడికక్కడే మంతనాలు సాగిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు కార్యకర్తలపైనే భారం మోపుతున్నారు. గ్రామాల్లోనే తిష్టవేసి పనికానివ్వాలని బడా లీడర్లు ఆదేశాలిస్తున్నారు.

మార్పు కోసం ఓటేయండి



మాచారెడ్డి: మార్పు కోసం తనకు ఓటేసి గెలిపించాలని కామారెడ్డి అసెంబ్లీకి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి నీల నాగరాజు కోరారు. మంగళవారం పాల్వంచ, మాచారెడ్డి మండలాల్లోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీవీ రిమోట్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మరోసారి ఆశీర్వదించండి

- టికెట్ కొనుక్కున్న మదన్‌మోహన్‌ను నమ్మొద్దు
- ఎమ్మెల్యే జాజాల సురేందర్



ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు



అడ్లూర్‌ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అభివృద్ధే లక్ష్యంగా పని చేశానని, మరో మారు అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం కుప్రియాల్, అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించారు. భారీ ఎత్తున మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాన్ లోకల్ వ్యక్తిని నమ్మి మోసపోవద్దన్నారు. సర్పంచ్‌లు సాయిరెడ్డి, షైడి జానకి జనార్దన్, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఎంపీటీసీలు స్వరూప, ఎడ్ల రేణుకా, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఓటర్లు బాగా ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు నందివాడ, ఎండ్రియాల్, దేమికలాన్, కన్‌కల్, కరడ్పల్లి తదితర గ్రామాలలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 50 సంవత్సరాలలో చేయని అభివృద్ధి పనులు బీఆర్ఎస్ 9 సంవత్సరాలలో చేసిందన్నారు. స్థానికంగా ఉండి ప్రజలకు సేవలు చేసే తనను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీపీ రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి సాక్షిగా ప్రమాణం చేద్దాం

రామారెడ్డి (ఎల్లారెడ్డి): కమీషన్లు తీసుకున్నారని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు ఆరోపణలు చేయడంపై ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ ఘాటుగా స్పందించారు. కమిషన్లు తీసుకున్నది ఎవరో కాలభైరవ స్వామి సాక్షిగా ప్రమాణం చేద్దామని మదన్‌మోహన్‌కు సవాల్ చేశారు. ఒక్క రూపాయి తీసుకోకుండా తాను పార్టీ మారినట్లు తెలిపారు. మంగళవారం రామారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహించారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

లింగంపేట/నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తెలంగాణలో మూడవ సారి బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు చేయడం ఖాయమైందని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నేత కిషోర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన నాగిరెడ్డిపేట నుంచి లింగంపేట వరకు బైక్ ర్యాలీ తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వందల రూ.కోట్లు మంజూరు చేయించి ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత జాజాల సురేందర్‌కే దక్కిందన్నారు. ఆయనకు ఎన్ఆర్ఐలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. సాయిలు, వినీత్‌రెడ్డి, వంశీయాదవ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం ఉండేది మూడు రోజులే

- రాజ్యసభ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గడీ



మాట్లాడుతున్న ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గడీ

బిచ్కుంద(జుక్కల్): తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఉండేది ఇక మూడు రోజులేనని, ప్రజలు కోరుకునే కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని ఆల్ ఇండియా మైనార్టీ సెల్ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గడీ అన్నారు. మంగళవారం బిచ్కుందలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు తరపున ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. సీఎం, పీఎం ఇద్దరూ ప్రజలను మోసగించడంలో చాలా సిద్ధహస్తులని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ చీకటి దోస్తులని త్రిబుల్ తలాఖ్, ఇతర మైనార్టీ వ్యతిరేక బిల్లులకు పార్లమెంటులో కేసీఆర్ బీజేపీకి మద్దతు తెలియజేశారని గుర్తు చేశారు. మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి రూ.4 వేల కోట్ల బడ్జెట్ కాంగ్రెస్ కేటాయిస్తుంద తెలిపారు. బీజేపీ, కేసీఆర్‌పై కవిత్వాలు చెప్పి కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, నాయకులు కమల్ కిషోర్, పాషా, నౌషా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సజావుగా నిర్వహించాలి



మద్నూర్(జుక్కల్): మరో రెండు రోజుల్లో నిర్వహించే ఎన్నికలను నియోజకవర్గంలో సజావుగా నిర్వహించేటట్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మను చౌదరి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, ఈవీఎం మిషన్లు, ఎన్నికల సామగ్రిని బుధవారం ఇక్కడి నుంచే తరలిస్తారని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది ఒక రోజు ముందే ఆయా గ్రామాల్లోకి సామగ్రి తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు.

వెల్లుట్లపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్



మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్ చిరంజీవులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెల్లుట్లపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం అయన వెల్లుట్లపేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన మదన్‌మోహన్‌కు గ్రామస్తులు బోనాలు, మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్ చిరంజీవులు, రైతు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మదన్‌మోహన్ కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అసైన్డ్ భూములకు పట్టాలను ఇప్పిస్తానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎల్లప్ప, బాలకిషన్, నవీన్, నారాయణ, నర్సింలు, కాశీరాం, కిషన్‌గౌడ్, విఠల్, తదితరులున్నారు.

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈవీఎంల తరలింపు, సామగ్రి పంపిణీకి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయా లేదా అనే వివరాలను ఆయన పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో బలపరచండి

- జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం(జుక్కల్): పిట్లంలో జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే రోడ్ షో, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళవారం ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యకర్తలు సింధేకు ఓటు వేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ..ఈ ఎన్నికల్లో అభివృద్ధి చేసే బీఆర్ఎస్‌ను బలపరిచాలని కోరారు. బీఆర్ఎస్ వస్తేనే ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం సెక్టోరియల్ అధికారి గిరి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఫర్నిచర్, పోలింగ్ సిబ్బందికి తగిన వసతులు ఉన్నాయా లేదా అని ఆయన ఆరా తీశారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపడతామని ఆయన చెప్పారు. బీఎల్‌వోలు అనిత, సునంద ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల సిబ్బంది నియామకం

మద్నూర్(జుక్కల్): జుక్కల్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని నియమించారు. నియోజకవర్గంలో మొత్తం 255 పోలింగ్ కేంద్రాలకు మొత్తం ప్రిసైడింగ్ ఆఫీసర్స్(పీవో) 306 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్(ఏపీవో) 306 మంది, అదర్ పోలింగ్ ఆఫీసర్స్(వోపీవో) 612 మంది, సెక్టోరల్ ఆఫీసర్స్ 25 రూట్లకు 25 మంది, పోలీస్ సిబ్బంది 510 మంది, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 55 ఉన్నట్లు ఎన్నికల అధికారులు చెప్పారు.

కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంపై ఐటీ దాడులు

- భారీగా నగదు స్వాధీనం..!
- కాంగ్రెస్ మండలాధ్యక్షుడిదే కార్యాలయం



కార్యాలయం ఎదుట పోలీసులు

కామారెడ్డి క్రైం: ఎన్నికల ముంగిట ప్రత్యేక బృందాలు తనిఖీలు పెంచాయి. మంగళవారం కామారెడ్డిలో ఎఫ్ఎస్‌టీ, ఐటీ అధికారులు మెరుపు దాడులు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు జీవధాన్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న శ్రుతి కన్‌స్ట్రక్షన్స్ అండ్ ట్రేడర్స్ కార్యాలయంపై దాడులు జరిగాయి. సదరు కార్యాలయం కాంగ్రెస్ సీనియర్ నేత, పార్టీ కామారెడ్డి మండల అధ్యక్షుడైన గూడెం శ్రీనివాస్ రెడ్డిదే కావడం గమనర్హం. మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో ఎఫ్ఎస్‌టీ బృందాలు మొదటగా దాడులు చేపట్టాయి. నగదు పెద్ద మొత్తంలో (దాదాపు 50 నుంచి 60 లక్షల వరకు) ఉన్నట్లు గుర్తించి ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎస్ఎఫ్‌టీ బృందం తనిఖీలు ప్రారంభమైన గంట తర్వాత ఐటీ అధికారులు అక్కడకు చేరుకున్నారు. లోపలికి ఎవరినీ అనుమతించలేదు. దాదాపు 50 మంది పోలీసులు అక్కడ బందోబస్తు చేపట్టారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకుడి కార్యాలయంలో పెద్ద మొత్తంలో నగదు పట్టుబడినట్లు ప్రచారం కావడం చర్చనీయాంశంగా మారింది.

కారు గుర్తుకు ఓటేసి సింధేను గెలిపించాలి



గున్కుల్‌లో ప్రచారం చేస్తున్న దఫేదార్ రాజు

నిజాంసాగర్(జుక్కల్): అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి హన్మంత్ సింధేను గెలిపిస్తే, మూడో సారి కేసీఆర్ సీఎం అవుతారని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్, గున్కుల్ గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధేకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ వీరంగణబాయి తనయుడు వెంకటేశం బీఆర్ఎస్‌లో చేరారు. గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, లక్ష్మారెడ్డి, మాలీస్‌రాజు, సురేశ్, నరేశ్, అంజిరెడ్డి, దుర్గయ్య, వెంకాగౌడ్, మొగులాగౌడ్, సాయాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పలు గ్రామాల్లో శివాలయాలలో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో శివునికి పూజలు చేశారు. గోపాల్‌పేటలోని వేణుగోపాలస్వామి ఆలయంతోపాటు తాండూర్‌లోని త్రిలింగేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది.



వైస్ చైర్‌పర్సన్ ఇంటిపై పోలీసుల దాడి

- అర్ధరాత్రి ఉద్రిక్తత



డీఎస్పీతో వాగ్వాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్: ఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియ ఇంటిపై పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడులు జరిపారు. డీఎస్పీ ప్రకాష్, స్పెషల్ ఫోర్స్ పోలీసులు అర్ధరాత్రి 2 గంటలకు విద్యానగర్ కాలనీలోని గడ్డం ఇందు ప్రియా ఇంటిపై దాడికిరావడంతో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గడ్డం చందులు, కాంగ్రెస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమకు సమాచారం మేరకు వచ్చామని డీఎస్పీ సమాధానం ఇచ్చారు. తాము కూడా సమాచారం ఇస్తామని వెళ్లి బీఆర్ఎస్ నేతల ఇళ్లపై దాడులు చేయాలని గడ్డం చందు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం అనంతరం పోలీసులు తనిఖీలు చేసి ఏం లభించకపోవడంతో అక్కడి నుంచి వెళ్లి పోయారు.

కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఇబ్బందులు

– వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

తాము కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి బీఆర్ఎస్ నేతలు తమను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ వాపోయారు. ఓక మహిళా ప్రజా ప్రతినిధి అని తెలిసినా తన ఇంటిపై మహిళా కానిస్టేబుల్ రాకుండా మగ పోలీసులు దాడులు చేశారన్నారు. కక్ష సాధింపు మానుకోవాలని కోరారు.



నిజాంసాగర్ చౌరస్తాలో ఒకరికొకరు ఎదురుపడిన బీజేపీ, బీఆర్ఎస్ వర్గాలు

అరగంట పాటు ఉత్కంఠ

- నిజాంసాగర్ చౌరస్తాలో బీజేపీ, బీఆర్ఎస్ పోటాపోటీగా నినాదాలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో మంగళవారం మధ్యాహ్నం బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య అరగంట పాటు ఉత్కంఠ వాతావరణం నెలకొంది. బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి బైక్ ర్యాలీ, రోడ్‌షోతో నిజాంసాగర్ చౌరస్తాకు చేరుకున్నారు. కేటీఆర్ రోడ్‌షో నేపథ్యంలో అక్కడే బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. దీంతో ఇరు వర్గాలు జోరుగా పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు రోడ్డు మధ్యలో అడ్డుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రకాష్ వచ్చి కేటీఆర్ రోడ్‌షో కార్యక్రమం ముగించడంతో బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి పంపించారు. దీంతో ఉత్కంఠకు తెరపడింది.

సుపరిపాలన కోసం మార్పు తప్పనిసరి

- మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వర్‌రావు

బాన్సువాడ: తెలంగాణ ప్రజలకు సుపరిపాలన అందించాలంటే మార్పు తప్పనిసరి అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మండవ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానన్న కేసీఆర్ మాట తప్పారని, నిధులు, నీళ్లు, నియమకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఉద్యోగాల భర్తీ చేయకుండా మభ్య పెట్టిందని, నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. పరిపాలనలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తాను కాంగ్రెస్‌లో చేరారని, కాంగ్రెస్‌తోనే ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయవచ్చునని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు కాసుల బాల్‌రాజ్, నార్ల రత్నకుమార్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, యలమంచిలి శ్రీనివాస్‌రావు, తదితరులు ఉన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి సుభాష్ రెడ్డి



లింగంపేటలో మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): డబుల్ ఇంజిన్ సర్కారుతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని బీజేపీ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో రోడ్ షోలో పాల్గొని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అవినీతి రహిత పాలన అందించడం బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఇంటికి చేరాయన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్.. పదేళ్ల బీఆర్ఎస్ పాలించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయన్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు అమ్ముడుపోవడం ఖాయమని ఆరోపించారు. ప్రతీ ఒక్కరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీ తీశారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ధర్మారావ్‌పేట్, అమర్లబండ, తిర్మన్‌పల్లి, మర్కల్, కుప్రియాల్, అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామాల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుభాష్‌రెడ్డి రోడ్డు షో నిర్వహించారు. ఓటు వేసి గెలిపించాలని కోరారు.



తాడ్వాయిలో బైక్ ర్యాలీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. సుభాష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

మీసానిపల్లిలో బీజేపీ నాయకుల ప్రచారం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని భిక్నూర్, మీసానిపల్లి గ్రామాలలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు.